# నీరసించిన ఎగుమతులు

**21 బిలియన్ డాలర్లకు వాణిజ్యలోటు**





న్యూఢిల్లీ, జూలై 15: రికార్డు స్థాయిలో దూసుకుపోయిన ఎగుమతులు మళ్లీ నీరసించాయి. గత నెలలో దేశీయ ఎగుమతులు కేవలం 2.56 శాతం పెరిగి 35.2 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. ఇదే సమయంలో దిగుమతులు 5 శాతం ఎగబాకి 56.18 బిలియన్ డాలర్లకు చేరాయి. దీంతో వాణిజ్యలోటు 20.98 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే నెలలో 19.19 బిలియన్ డాలర్లుగా ఉన్నది. క్రూడాయిల్, పప్పుదినుసులు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు అధికంగా దిగుమతికావడం వల్లనే లోటు అధికంగా పెరిగిందని తెలిపింది. మరోవైపు, ఏప్రిల్ నుంచి జూన్ మధ్యకాలంలో ఎగుమతులు 5.84 శాతం పెరిగి 109.96 బిలియన్ డాలర్లకు చేరుకోగా, దిగుమతులు 7.6 శాతం అధికమై 172.23 బిలియన్ డాలర్లకు చేరాయి. దీంతో వాణిజ్యలోటు 62.26 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

- చమురు దిగుమతులు 19.62 శాతం పెరిగి 15 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో 23 శాతం ఎగబాకి 51.5 బిలియన్ డాలర్లకు చేరాయి.
- కానీ, పసిడి దిగుమతులు 38.66 శాతం తగ్గి 3 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 1.91 శాతం పెరిగి 9.51 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.
- గత నెలలో 30.27 బిలియన్ డాలర్ల విలువైన సేవలు ఎగుమతయ్యాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో 27.79 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.
- అమెరికా, యూఏఈ, మలేషియా, బంగ్లాదేశ్, తాంజానియా, నెదర్లాండ్స్, సింగపూర్ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి.

*ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వస్తువులు, సేవల ఎగుమతులు 800 బిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశం ఉన్నది. ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఫార్మాస్యూటికల్స్, కాఫీ, కెమికల్స్ ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్ ఉండటంతో ఎగుమతుల్లో రెండంకెల వృద్ధి నమోదైంది.*

***- సునీల్ బార్త్వాల్, వాణిజ్య శాఖ కార్యదర్శి***

# రుణగ్రహీతలకు ఎస్బీఐ షాక్




**ఎస్బీఐ రుణాలపై పెరిగిన వడ్డీరేట్లు (శాతాల్లో)**

| కాలవ్యవధి | ప్రస్తుత ఎంసీఎల్ఆర్ | మారిన ఎంసీఎల్ఆర్ | పెరుగుదల |
|---|---|---|---|
| ఓవర్‌నైట్ | 8.10 | 8.10 | యథాతథం |
| ఒక నెల | 8.30 | 8.35 | 5 బేసిస్ పాయింట్లు |
| 3 నెలలు | 8.30 | 8.40 | 10 బేసిస్ పాయింట్లు |
| 6 నెలలు | 8.65 | 8.75 | 10 బేసిస్ పాయింట్లు |
| ఏడాది | 8.75 | 8.85 | 10 బేసిస్ పాయింట్లు |
| 2 ఏండ్లు | 8.85 | 8.95 | 10 బేసిస్ పాయింట్లు |
| 3 ఏండ్లు | 8.95 | 9.00 | 5 బేసిస్ పాయింట్లు |

ముంబై, జూలై 15: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) తమ రుణగ్రహీతలకు షాకిచ్చింది. ఆయా కాలవ్యవధులతో కూడిన రుణాలపై వడ్డీరేట్లను పెంచుతున్నట్టు సోమవారం ప్రకటించింది. ఈ క్రమంలోనే మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్-బేస్డ్ లెండింగ్ రేటు (ఎంసీఎల్ఆర్)ను 10 బేసిస్ పాయింట్లదాకా పెంచింది. ఎంసీఎల్ఆర్ అంటే.. కనీస రుణ రేటు. దీనికంటే తక్కువ వడ్డీరేటుకు బ్యాంకులు రుణాలివ్వరాదు. ఎస్బీఐ అధికారిక వెబ్‌సైట్ ప్రకారం పెరిగిన వడ్డీరేట్లు వెంటనే అమల్లోకి వస్తాయి.

**ఈఎంఐల భారం**

ఎస్బీఐ తీసుకున్న తాజా నిర్ణయంతో ముఖ్యంగా వాహన, గృహ రుణాలు ప్రియమైపోయాయి. ఇప్పటికే ఆటో, హోమ్ లోన్లపై వడ్డీరేట్లు మోయలేనంతగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీటి ఈఎంఐలు మరింత పెరిగాయి. కరోనా మహమ్మారి ప్రభావంతో బలహీనపడ్డ దేశ ఆర్థిక వ్యవస్థను బలపర్చేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) 2020లో వడ్డీరేట్లను గణనీయంగా తగ్గించిన విషయం తెలిసిందే. దీంతో అంతా రుణాలు తీసుకున్నారు. అయితే కరోనా పరిస్థితులు అదుపులోకి రావడం, మరోవైపు ద్రవ్యోల్బణం విజృంభించడంతో ధరలను కట్టడి చేయడానికి సెంట్రల్ బ్యాంక్ వడ్డీరేట్లను పెంచుకుంటూపోయింది. వరుస ద్రవ్యసమీక్షల్లో వడ్డనల వల్ల రెపో రేటు గరిష్ఠంగా 6.50 శాతానికి చేరింది. నిరుడు ఫిబ్రవరిలో ఆఖరిసారిగా పెంచగా.. అప్పట్నుంచి రెపో అక్కడే ఉంటున్నది. దీంతో బ్యాంకులూ, ఇతరత్రా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలూ తమ రుణాలపై వడ్డీరేట్లను ఆ మేరకు పెంచేశాయి. ఫలితంగా వడ్డీరేట్లు తక్కువగా ఉన్నాయని రుణాలు తీసుకున్నవారిపై ఇప్పుడు నెలవారీ వాయిదాల భారం మోయలేని విధంగా తయారైంది. ఇది ఎస్బీఐ రుణగ్రహీతలపై ఇంకా పెరిగిందిప్పుడు. నిజానికి గత నెల జూన్‌లోనూ ఎంసీఎల్ఆర్‌ను ఎస్బీఐ 10 బేసిస్ పాయింట్ల వరకు పెంచింది. దీంతో అన్ని కన్జ్యూమర్ లోన్లు ఖరీదెక్కాయి.

**మారని ఈబీఎల్ఆర్**

ఎస్బీఐ ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు (ఈబీఎల్ఆర్) 9.15 శాతం+సీఆర్పీ, బీఎస్పీగానే ఉన్నది. అన్ని గృహ రుణాలకు ఈ రేటే లింకై ఉంటుంది. సిబిల్ స్కోర్ ఆధారంగా ఖాతాదారులు తీసుకున్న రుణాలపై వడ్డీరేట్లు 8.50 శాతం నుంచి 9.65 శాతం మధ్య ఉంటాయి. ప్రాసెసింగ్ ఫీజు తీసుకున్న రుణంలో 0.35 శాతానికి సమానంగా ఉంటుంది. దీనికి వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అదనం. అయినప్పటికీ మొత్తంగా కనీస ఫీజు రూ.2,000, గరిష్ఠం రూ.10,000గానే ఉంటుంది. ఇక గత ఏడాది జూన్ 15 నుంచి ఎస్బీఐ బేస్ రేటు 10.40 శాతంగానే ఉంటున్నది. అలాగే ఈ ఏడాది జూన్ 15 నుంచి బ్యాంక్ వార్షిక బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటు (బీపీఎల్ఆర్) 15.15 శాతంగా మారిన విషయం తెలిసిందే.




*బెంగళూరులో జరిగిన టైమ్స్ నౌ ఇండియా ఇన్‌ఫ్రా ట్రాన్స్‌పోర్టేషన్ సమ్మిట్‌లో ఇంపాక్టబుల్ ఇన్‌ఫ్రా లీడర్-2024 అవార్డు అందుకుంటున్న ఎల్ అండ్ టీ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తదితరులు*

## ఐపీవోకి సాయి లైఫ్ సైన్సెస్!

న్యూఢిల్లీ, జూలై 15: హైదరాబాద్ కేంద్రస్థానంగా కార్యకలాపాలు అందిస్తున్న సాయి లైఫ్ సైన్సెస్..స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టబోతున్నది. ఇందుకు సంబంధించి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తు చేసుకున్నది కూడా. వ్యాపార విస్తరణకోసం అవసరమయ్యే నిధుల్లో రూ.800 కోట్ల నిధులను ఐపీవో ద్వారా సేకరించడానికి సిద్ధమైంది. ప్రమోటర్లు, షేరుహోల్డర్లు, ఇన్వెస్టర్ షేరుహోల్డర్లకు చెందిన 6.15 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో విక్రయించనున్నారు. వాటాలు విక్రయించనున్న ప్రమోటర్లలో సాయి క్విస్ట్ సైన్ ప్రైవేట్ లిమిటెడ్, టీపీజీ ఆసియా 8 ఎస్ఎఫ్ పీటీఈ లిమిటెడ్, హెచ్‌బీఎం ప్రైవేట్ ఈక్విటీ ఇండియాలు ఉన్నాయి.

## బీవోబీ మాన్‌సూన్ ధమాకా డిపాజిట్ స్కీం

న్యూఢిల్లీ, జూలై 15: ప్రభుత్వ బ్యాంకింగ్ దిగ్గజాల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ).. మాన్‌సూన్ ధమాకా డిపాజిట్ స్కీంను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ స్కీం కింద 399 రోజుల కాలపరిమితి కలిగిన రిటైల్ టర్మ్ డిపాజిట్లపై 7.25 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్న బ్యాంక్..333 రోజుల కాల పరిమితిపై 7.15 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది. అలాగే సీనియర్ సిటిజన్లకు అదనంగా మరో అర శాతం వడ్డీని చెల్లిస్తుండటంతో 7.65 శాతం నుంచి 7.75 శాతం మధ్యలో వడ్డీని ఆఫర్ చేస్తున్నది. రూ.3 కోట్ల లోపు టర్మ్ డిపాజిట్లకు ఈ ప్రత్యేక స్కీం వర్తించనున్నదని పేర్కొంది.





## రాష్ట్ర మార్కెట్లోకి అపాచీ సరికొత్త బైకు

**ధర రూ.1.20 లక్షలు**

హైదరాబాద్, జూలై 15: టీవీఎస్ మోటర్.. రాష్ట్ర మార్కెట్లోకి సరికొత్త అపాచీ 160 సిరీస్ డార్క్ ఎడిషన్‌గా విడుదల చేసింది. వీటిలో టీవీఎస్ అపాచీ ఆర్టీఆర్ 160 మాడల్ ధర రూ.1,09,990, అపాచీ ఆర్టీఆర్ 160 4వీ మాడల్ ధర రూ.1,19,900గా నిర్ణయించింది. ఈ ధరలు హైదరాబాద్ షోరూంనకు సంబంధించినవి. ఈ సందర్భంగా కంపెనీ బిజినెస్ హెడ్ విమల్ సుంబ్లే మాట్లాడుతూ.. 160 సీసీ ఇంజిన్ సామర్థ్యంతో రూపొందించిన ఈ రెండు మోటర్‌సైకిళ్లు 17.6 పీఎస్ 9250 శక్తినివ్వనున్నదని, యువతకు నచ్చే విధంగా వీటిని రూపొందించినట్లు చెప్పారు. డిజిటల్ ఎల్‌సీడీ క్లస్టర్, ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్, యాంటీ బ్రేక్ సిస్టమ్‌వంటి ఫీచర్స్ ఉన్నాయి.

## చెప్పేది విన్నాకే..

**ఫ్రాడ్ రిస్క్ మేనేజ్‌మెంట్ మార్గదర్శకాలను మార్చిన ఆర్బీఐ**




ముంబై, జూలై 15: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) సోమవారం ఫ్రాడ్ రిస్క్ మేనేజ్‌మెంట్‌పై తమ మాస్టర్ డైరెక్షన్స్‌ను సవరించింది. ఏదైనా ఖాతాను మోసంగా ప్రకటించే ముందు సదరు ఖాతాదారుడు లేదా రుణగ్రహీత చెప్పేది బ్యాంకులు (రుణదాతలు) వినాలన్న సుప్రీం కోర్టు తీర్పు సిఫార్సు మేరకే ఈ మార్పులు చేసింది. ఎస్బీఐ, రాజేశ్ అగర్వాల్ కేసులో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం.. రుణగ్రహీతల హక్కులను గౌరవించాలని పేర్కొన్నది. ఈ క్రమంలోనే ఖాతాను మోసంగా వర్గీకరించే ముందు సదరు రుణగ్రహీత చెప్పినదాన్ని విని ఓ నిర్ణయానికి రావాలన్నది. దీంతో ఇకపై బ్యాంకులు దీన్ని అనుసరించాల్సిందేనంటూ ఆర్బీఐ తాజా మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది.



*టీ హబ్‌ను ఇన్‌ఫ్రా కార్పొరేట్ ఎక్సలెన్స్ అవార్డు వరించింది. కూరగాయల వ్యర్థాలను అధిక పోషక కంపోస్ట్ ఎరువుగా తయారు చేసి, వాటిని తిరిగి తమ ప్రాంగణంలో ఉన్న చెట్లకు వాడామని టీ హబ్ సీఈవో ఎంఎస్ రావు తెలిపారు. అదేవిధంగా ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి రీసైక్లింగ్ చేశామని, ఈ రెండు చర్యలకు గాను అవార్డు దక్కిందని ఆయన వెల్లడించారు.*

## టీసీఎస్‌లో ఫ్రెషర్లకు 40 వేల ఉద్యోగాలు!

న్యూఢిల్లీ, జూలై 15: దేశీయ టెక్నాలజీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్)..ఫ్రెషర్లకు పెద్దపీట వేస్తున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి 40 వేల మంది ఫ్రెషర్లను నియమించుకునేయోచనలో సంస్థ ఉన్నది. గత త్రైమాసికంలో కొత్తగా 5,452 మందిని రిక్రూట్ చేసుకోవడంతో మొత్తం సంఖ్య 6,06,998కి చేరుకున్నారు. ప్రపంచ ఐటీ రంగంలో గణనీయమైన మార్పులకు లోనవుతున్న ప్రస్తుత తరుణంలో భారత్ ప్రతిభకు కేంద్రంగా మారిందని, భవిష్యత్తులో మార్పులు వచ్చే అవకాశాలు కనిపించడం లేదని టీసీఎస్ సీహెచ్ఆర్వో మిలింద్ లక్కాడ్ తెలిపారు.

## ఆల్‌టైమ్ కనిష్ఠానికి రుపీ

**మరో 10 పైసలు క్షీణించిన విలువ**

**83.61 స్థాయికి పతనం**

ముంబై, జూలై 15: డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ మునుపెన్నడూ లేని స్థాయికి దిగజారింది. సోమవారం ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని తాకుతూ 83.61కి పడిపోయింది. గత శుక్రవారం ముగింపుతో చూస్తే 10 పైసలు తగ్గింది. ఒకానొక దశలో 83.62 స్థాయికి నష్టపోయింది. అయితే తిరిగి స్వల్పంగా కోలుకున్నది.

**ద్రవ్యోల్బణం దెబ్బ**

దేశీయంగా విజృంభిస్తున్న ద్రవ్యోల్బణం.. రూపాయిని ప్రభావితం చేస్తున్నట్టు బీఎన్పీ పరిబాస్‌కు చెందిన షేర్‌ఖాన్‌లో రిసెర్చ్ అనలిస్ట్‌గా ఉన్న అనుజ్ చౌధరి విశ్లేషించారు. ఈ క్రమంలోనే భారతీయ స్టాక్ మార్కెట్లు రికార్డు స్థాయి లాభాల్లో ముగిసినా.. ఆ ఉత్సాహాన్ని అందుకోలేకపోయినట్టు చెప్తున్నారు.

# వేంసూరుకు బేతుపల్లి జలాలు

- **గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసిన ఐబీ అధికారులు**
- **మాజీ సీఎం కేసీఆర్ చలవేనంటూ రైతుల కృతజ్ఞతలు**



నీటిని విడుదల చేస్తున్న అధికారులు, నాయకులు

సత్తుపల్లిటౌన్, జూలై 15 : వేంసూరుకు బేతుపల్లి వరద నీటిని తరలించేందుకు ఏర్పాటు చేసిన కాల్వకు ఐబీ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు గేట్లు ఎత్తి సోమవారం నీటిని విడుదల చేశారు. 2016లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక నిధులు కేటాయించడంతో అప్పటి భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు మొట్టమొదటి సారిగా బేతుపల్లి వరదనీటి కాల్వ ద్వారా 57 చెరువులకు సంపూర్ణంగా సాగునీటి జలాలను తరలించారు. దీంతో వేంసూరు మండలంలో సుమారు 50 వేల ఎకరాల వరకు భూములు సాగులోకి వచ్చాయి. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రివర్గంలో పనిచేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ వల్ల తమకు సాగునీరు అందుతున్నాయని వేంసూరు రైతులు హర్షం వ్యక్తం చేస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. నీటి విడుదల కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు దయానంద్ రాగమయి, వేంసూరు మండలానికి చెందిన చల్లగుండ్ల నరసింహారావు, వెల్ది జగన్మోహన్‌రావు, ఫైజుద్దీన్, సత్తుపల్లికి చెందిన దొడ్డా శ్రీనివాసరావు, ఇమ్మనేని ప్రసాద్, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ‘అమ్మబాట-అంగన్‌వాడీ బాట’ షురూ..

**ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు కార్యక్రమాలు**

**ఖమ్మం నగరంలో పాల్గొన్న సీడీపీవో కవిత**



ర్యాలీనుద్దేశించి మాట్లాడుతున్న సీడీపీవో కవిత

ఖమ్మం వ్యవసాయం, జూలై 15 : జిల్లాలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమంలో భాగంగా తొలి రోజు అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ర్యాలీలతో కార్యక్రమాలను ప్రారంభించారు. ముస్తఫానగర్ సెక్టార్ పరిధిలోని 24వ డివిజన్ శాంతినగర్ పాఠశాలలో గల అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన వేడుకలకు అర్బన్ సీడీపీవో కవిత, స్థానిక కార్పొరేటర్ కమర్తపు మురళీతో కలిసి హాజరయ్యారు. అలాగే నగరంలోని ఆయా సెక్టార్లలో జరిగిన ర్యాలీలలో సూపర్‌వైజర్లు, టీచర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఖమ్మం నగరంతోపాటు తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్, మధిర, కామేపల్లి, కల్లూరు, సత్తుపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టులలో సైతం ‘అమ్మమాట-అంగన్‌వాడీ బాట’ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సీడీపీవో కవిత మాట్లాడుతూ సోమవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 16,17న అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో టీచర్లు, హెల్పర్లు, యువత, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో కలిసి అవగాహన ర్యాలీలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. 18న ఇంటింటి సందర్శన చేపట్టి రెండున్నరేళ్ల పిల్లలను గుర్తించి కేంద్రాల్లో చేర్పించనున్నట్లు చెప్పారు. 19న కేంద్రాల్లో పచ్చదనం-పరిశుభ్రత, కిచెన్ గార్డెన్ పనులు ఉంటాయని తెలిపారు. 20న కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసం, చిన్నారుల తల్లిదండ్రులు, బంధువులతో కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య విదానంపై అవగాహన సదస్సులు ఉంటాయని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షకురాలు పుష్పలత, పలువురు టీచర్లు, హెల్పర్లు, కాలనీల పెద్దలు పాల్గొన్నారు.

# జామకు కుళ్లు తెగులు

- **చెట్టుపైనే రంగుమారి కుళ్లిపోతున్న కాయలు**
- **ఆందోళన చెందుతున్న జామ సాగు రైతులు**
- **ఉద్యాన శాఖ అధికారులు పంటను పరిశీలించాలని కోరుతున్న రైతులు**



చంద్రుగొండలో రైతు సాగు చేస్తున్న జామ తోట



కుళ్లిన జామకాయలు

చంద్రుగొండ, జూలై 15 : కోతులు, పక్షుల బారి నుంచి కంటికి రెప్పలా కాపాడుకున్న జామ పంటను కుళ్లు తెగుళ్లు పట్టి పీడిస్తున్నాయి. చెట్టుపైనే రంగుమారి కాయలకు పురుగుపడి కుళ్లిపోతుండడంతో సాగు రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రానికి చెందిన ఎస్కే జానీమియా తనకున్న ఎకరం భూమిలో జామ తోట సాగు చేస్తున్నాడు. రెండేళ్లుగా సాగు బాగానే ఉన్నా.. ఈ ఏడాది తోట కాపు కొచ్చి కాయలు చేతికొచ్చే సమయంలో రంగుమారి చెట్టుపైనే కుళ్లిపోతున్నాయి. కాయలను పగులగొట్టి చూస్తే వాటిలో పురుగులు కనిపిస్తున్నాయని రైతు తెలిపాడు. ఏడాదికి మూడు కాపులు వచ్చే పంట.. ఈ ఏడాది వానకాలం కాపు కాయలన్నీ కుళ్లిపోతున్నాయి. ప్రతి కాపునకు సుమారు రూ.50 నుంచి రూ.60 వేల వరకు జామపై లాభాలు వచ్చేవని , ఇప్పుడు రూ.18 వేల వరకు అప్పు చేసి పురుగు మందులు కొట్టినప్పటికీ జామలో కుళ్లు తెగులు ఆగడం లేదని రైతు వాపోయాడు. తోటలో జామ కాయలకు పురుగులు పడి చెడిపోతున్నా ఉద్యాన శాఖ అధికారులు వచ్చి చూడడం లేదని, సరైన సలహాలు, సూచనలు ఇచ్చే నాధుడే కరువయ్యారని రైతు జానీమియా కన్నీటి పర్యంతమయ్యాడు. ఇలా జానీమియా తోటలోనే కాకుండా ఇతర ప్రాంతాల్లోని రైతుల తోటల్లో కూడా ఇదే పరిస్థితి ఉన్నదని, వెంటనే అధికారులు తగిన సూచనలు, సలహాలు అందించాలని, ప్రభుత్వం ఆదుకోవాలని జానీమియాతోపాటు సాగు రైతులు కోరుతున్నారు.

## పీఆర్ శాఖలో ముగిసిన బదిలీలు



బదిలీలు నిర్వహిస్తున్న ఏడీసీ సన్యాసయ్య

మామిళ్లగూడెం, జూలై 15 : పంచాయతీరాజ్ శాఖలో జిల్లా స్థాయి అధికారులు, సిబ్బందికి డీపీఆర్ ఏసీ భవనంలో అదనపు కలెక్టర్, డీఆర్‌డీవో సన్యాసయ్య పర్యవేక్షణలో సోమవారం బదిలీల ప్రక్రియను చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం బదిలీలకు అర్హత ఉన్న వారి నుంచి ప్రాధాన్యతలను స్వీకరించిన తర్వాత జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానాలను గుర్తించి బదిలీలు చేపట్టారు. ఇందులో భాగంగా ఎంపీవోలు 3, గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు 9, గ్రేడ్-2 పంచాయితీ కార్యదర్శులు 8, గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులు 19, గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులు 129, బిల్ కలెక్టర్లు 2.. మొత్తంగా 171 మందిని బదిలీ చేసినట్లు బదిలీల కన్వీనర్, డీపీవో హరికిషన్ తెలిపారు. వెంటనే విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో వినోద్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆదేశాల మేరకే బదిలీలు



బదిలీ ఉత్తర్వులు అందజేస్తున్న గురుకుల ఆర్సీవో వెంకటేశ్వరరాజు

భద్రాచలం, జూలై 15 : ప్రభుత్వ ఆదేశాల మేరకే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గురుకుల, ఆశ్రమ కళాశాలల్లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, నాలుగో తరగతి సిబ్బందికి బదిలీలు చేస్తున్నట్లు ఖమ్మం రీజియన్ గురుకుల ఆర్సీవో తుమికి వెంకటేశ్వరరాజు తెలిపారు. సోమవారం పీఎంఆర్సీ భవనంలోని సమావేశ మందిరంలో ఐటీడీఏ పీవో బీ.రాహుల్ ఆదేశాల మేరకు కమిటీ సభ్యుల సమక్షంలో బదిలీపై వెళ్తున్న వారికి ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాల, కళాశాలల్లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, ల్యాబ్ అసిస్టెంట్లు, మల్టీపర్పస్ వర్కర్, కిచెన్ సహాయకులకు కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు చేపట్టామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 40 శాతం సిబ్బందికి బదిలీలు చేయాల్సి ఉండగా.. 26 మందిని బదిలీ చేశామని, అందులో జూనియర్ అసిస్టెంట్లు ఐదుగురు, ల్యాబ్ అసిస్టెంట్లు ఏడుగురు, కార్యాలయ సహాయకులు ఐదుగురు, మల్టీపర్పస్ వర్కర్లు 7, కిచెన్ సహాయకులు ఇద్దరిని కౌన్సిలింగ్ ద్వారా బదిలీ చేశామని ఆర్సీవో తెలిపారు. కార్యక్రమంలో గురుకుల ఏవో నరేందర్, పర్యవేక్షకుడు కృష్ణార్జున, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ దేవదాస్ పాల్గొన్నారు.

# లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలి

- **జల్లేపల్లి జడ్పీహెచ్ఎస్‌ను సందర్శించిన కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్**



జల్లేపల్లి జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

తిరుమలాయపాలెం, జూలై 15 : విద్యార్థులు చిన్నతనం నుం చే తమ భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకొని చదివినప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ అన్నారు. జల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించిన ఆయన పదో తరగతి క్లాస్ రూమ్ కు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. కష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చని, ఆ దిశగా ప్రతి విద్యార్థి ముందుకు సాగాలన్నారు. చదువుతోపాటు ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఆరోగ్యంగా ఎదగడానికి మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఎలా ఉంది? గుడ్లు ఇస్తున్నారా? ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అన్నం, కూరలు రుచిగా ఉండడం లేదని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రుచికరమైన భోజనం అందించేలా చర్యలు చేపట్టాలని హెచ్‌ఎంను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో కలెక్టర్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం దారా రాజేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**అర్జీలను ప్రాధాన్యతతో పరిష్కరించాలి**

ఖమ్మం, జూలై 15 : ప్రజావాణిలో సమర్పించిన అర్జీలకు ప్రాధాన్యతనిచ్చి వెనువెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధికారులతో కలిసి ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఒక్కొక్కరికి నుంచి స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి అప్పటికప్పుడే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టొద్దన్నారు. కాగా.. తిరుమలాయపాలెం మండలం బీరోలుకు చెందిన గోపోజు సురేశ్, గాదెగాని సునీత, కొణిజర్ల మండలం గద్దలగూడెంకు చెందిన తమ్మినేని సీతారాములు, బోనకల్లు మండలం ఆళ్లపాడుకు చెందిన చేబ్రోలు రాజగోపాలం, కృష్ణయ్య, బోనకల్లు మండలం పెద్దబీరవల్లికి చెందిన సాధం శ్రీనివాసరావు తమ తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. వీటిని వెంటనే సంబంధింత శాఖల అధికారులకు పంపించారు. ప్రజావాణి కార్యక్రమంలో డీఆర్వో ఎం.రాజేశ్వరి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సు ఢీకొని ఆటో డ్రైవర్ మృతి

బూర్గంపాడు, జూలై 15: ఆర్టీసీ బస్సు ఆటోని ఢీకొని ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన బూర్గంపాడు మండలంలోని పాత గొమ్మూరు ఇసుక ర్యాంపు సమీపంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకున్నది. ఎస్సై రాజేశ్ తెలిపిన వివరాల ప్రకారం ... భద్రాచలం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బూర్గంపాడు మీదుగా భద్రాచలం వెళ్తుండగా భద్రాచలం నుంచి ఆటో డ్రైవర్ శ్రీనివాసరావు (34) బూర్గంపహాడ్ మీదుగా అల్లూరి జిల్లా కుక్కునూరు మండలం సీతారాంనగర్ గ్రామానికి వెళ్తున్నాడు. ఆటో పాత గొమ్మూరు ర్యాంపు సమీపంలో ఢీ కొనడంతో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై రాజేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆటోలో ఇరుక్కున్న మృతుడిని బయటికి తీసి బూర్గంపహాడ్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య రత్నకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.